ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 23.11.2025 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. భగవాన్ శ్రీ సత్యసాయి ఆశీస్సులతో 2047 నాటికి భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేసారు.
2. సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతోనే హైదరాబాద్ లో మువ్వెన్నెల జెండా ఎగిరిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కొనియాడారు
3. ఫ్యూచర్ సిటీ లో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా, అంతర్జాతీయ స్థాయిలో జరిపేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
4. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అత్యుత్తమ0గా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యా వ్యవస్థలో మార్పు తేవాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

----------------------

**సత్యసాయి**

భగవాన్ శ్రీ సత్యసాయి ఆశీస్సులతో 2047 నాటికి భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ఆశిస్తున్నట్టు ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవ కోసం సత్యసాయిబాబా నాయకులను తయారు చేశారన్నారు.

**బైట్ - ఉప రాష్ట్రపతి**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... సత్యసాయిబాబా మనుషుల్లో దేవుడిని చూశారని , ప్రేమతో మనుషులను గెలిచారని అన్నారు. గతంలో పాలమూరు జిల్లాలో బాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు తాగునీటి కష్టాల నుంచి విముక్తి చేసి వారి దాహార్తిని తీర్చారని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

**బైట్ - రేవంత్ రెడ్డి**

ఈ కార్యక్రమంలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

**డెస్క్**

---------------------

**కిషన్ రెడ్డి**

దేశ సమగ్రత, ఐక్యతను చాటేలా హైదరాబాద్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలు జరిగాయి. భారీ ఏకతా మార్చ్ లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ , సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతోనే హైదరాబాద్ గడ్డపై మువ్వెన్నెల జెండా ఎగిరిందని , తెలంగాణకు ఆయన కంటే గొప్పవారు లేరని కొనియాడారు.

**బైట్ - కిషన్ రెడ్డి**

సికింద్రాబాద్ లోని సీతాఫల్‌మండి నుంచి చిలకలగూడలోని గాంధీ విగ్రహం వరకు ఈ మార్చ్ సాగింది.

**పీటీసీ హైదరాబాద్**

-------------------

**సమ్మిట్**

వచ్చేనెల 8 , 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కోసం ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా జరపాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిన్న మధ్యాహ్నం ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్లోబల్ సమ్మిట్ అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించాలని ఆయన అన్నారు..

**పీఎస్**

---------------------

**అందెశ్రీ**

తెలంగాణలోని ముఖ్యమైన పరిణామాల్లో కవులు , కళాకారులు కీలక భూమిక పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రముఖ కవి అందెశ్రీ సంతాప సభ నిన్న సాయంత్రం జరిగింది. ఈ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఎంతో మందిలో స్ఫూర్తిని రగిల్చిన 'జయ జయహే తెలంగాణ ' గీతం ప్రజల గుండెల్లో ఇంకా ప్రతిధ్వనిస్తోందన్నారు.

**పీఎస్**

-----------------

**పొన్నం**

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈరోజు సిద్దిపేట జిల్లా కోహెడలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప ఆలయానికి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భవిష్యత్ లో ఆర్థిక వృద్ధి సాధించి మహిళలు ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.

**పీటీసీ - సిద్ధిపేట**

--------------------

**వాకిటి**

ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని తీసుకువచ్చిందని రాష్ట్ర యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. వరంగల్ ట్రైసిటీ హాఫ్ మారథాన్-2025 పోటీలను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డితో కలిసి ఈరోజు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వేలాది మైదానాలను క్లీన్ చేస్తున్నామని పేర్కొన్నారు. దాదాపు 35 కోట్ల రూపాయలతో విజయ డెయిరీని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

**పీటీసీ** - వరంగల్

**చర్చాగోష్టి**

తెలంగాణ–నార్త్ ఈస్ట్ కనెక్ట్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా నిన్న "స్పిరిట్ ఆఫ్ ద గేమ్స్ – కనెక్టింగ్ తెలంగాణ అండ్ నార్త్ ఈస్ట్" అనే అంశంపై విశిష్ట చర్చాగోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ , ఈశాన్య రాష్ట్రాల నుంచి ప్రముఖ క్రీడాకారులు, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు రంగాల ప్రముఖులు మాట్లాడుతూ.. ఆయా రాష్ట్రాల్లో , రంగాల్లో ఎదురవుతున్న సమస్యలు , అడ్డంకులను అధిగమించే మార్గాలను గురించి చర్చించారు.

**పీఎస్**

-----------------------------

**ఒప్పందం**

తలసీమియా బాల సేవా యోజన కార్యక్రమం కింద కోలిండియా లిమిటెడ్‌తో హైదరాబాద్ లోని రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ అవగాహనా ఒప్పందం

కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రధానమంత్రి ఆదేశాలతో కోలిండియా తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా ప్రతి బాధితుడికి 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 17 ఆస్పత్రులతో ఈ ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 800 మంది పిల్లలకు బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ జరిగిందని కిషన్ రెడ్డి చెప్పారు.

**పీఎస్**

---------------------------

**శ్రీధర్ బాబు**

విద్యా వ్యవస్థలో సమూల మార్పు తేవాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దే లక్ష్యం పై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. కూకట్ పల్లిలోని జేఎన్టీయూ హెచ్ ఆడిటోరియంలో నిన్న నిర్వహించిన 'జేఎన్టీయూహెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్ - 2025 'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తమ ప్రభుత్వం విద్య , వైద్యానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు.

**డెస్క్**

------------------------

**సమీక్ష**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి రవాణా శాఖ అమలు చేస్తున్న సంస్కరణలను మరింత కఠిన తరం చేసేలా ఉన్నత స్థాయి అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ నిన్న సమీక్ష నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించి మరణాల రేటును నివా రించే విధంగా అధికారులు పని చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. గత 10 రోజులలో రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 4వేల 748 కేసులు నమోదు చేసినట్లు , 3వేల 420 వాహనాలు సీజ్ చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా మంత్రికి తెలియజేశారు.

**పీఎస్**

**పథకం**

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా , చిన్న, సన్న కారు రైతులకు పండ్ల తోటల పెంపకానికి అవకాశం ఉందని , ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని , ఉపాధిహామీ పథకం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల ఏం టి ఎ ఇప్ప ధనుంజయ్ చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

**బైట్ - ధనుంజయ్**

పీటీసీ – సిరిసిల్ల

**డ్యామ్**

కరీంనగర్ జిల్లా తనుగుల-పెద్దపల్లి మధ్య మానేరు వాగుపై చెక్‌డ్యామ్ కూలిపోయింది. మానేరు పరివాహక ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి , సాగునీటికి కొరత లేకుండా ఉండేందుకు 2023లో 23 కోట్ల పైచిలుకు వ్యయంతో ఈ చెక్ డ్యామ్

నిర్మించారు. శుక్రవారం రాత్రిడ్యాం కుంగి పోవడంతో చెక్ డ్యాంలోని నీరంతా దిగువ పోయింది. సమాచారం తెలుసుకున్న నీటిపారుదల శాఖ అధికారులు , స్థానిక ప్రజా ప్రతినిధులు చెక్ డ్యాం వద్దకు వెళ్లి పరిశీలించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయించారు.

**పీటీసీ – కరీంనగర్**

**పత్తి**

ఆసిఫాబాద్ జిల్లాలో సిసిఐ విధించిన ఎకరానికి 7 క్వింటాళ్ల కంటే ఎక్కువగా పత్తి దిగుబడి వస్తే ఆయా మండలాల ఏఈవోల నుండి రైతులు ముందస్తు అనుమతి పత్రం తీసుకుని కపాస్ కిసాన్ ఆప్ లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌలు రైతులు ఏఈవోల వద్ద రిజిస్ట్రేషను చేయించి స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

**పీటీసీ** – ఆసిఫాబాద్

**ముద్ర**

ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం చిన్న , సూక్ష్మ వ్యాపారుల కోసం రూపొందించిన అత్యంత ప్రయోజనకరమైన పథకం అని జనగామ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శివకృష్ణ అన్నారు. ఈరోజు నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆయన మాట్లాడుతూ.. స్వయం ఉపాధిని ప్రోత్సహించడంలో ముద్ర యోజన పథకం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.

**పీటీసీ** - జనగామ